కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18 క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.19, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.75, బీట్‌రూట్ రూ.15, కీర రూ.28, బీన్స్ రూ.125, క్యాప్సికమ్ రూ.45లుగా ఉన్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 నుంచి 11గంటల వరకు...
◆ లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సంగం లక్ష్మీబాయ్ కాలేజ్, సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్. సిరిపురం కాలనీ కమ్యూనిటీ హాల్, దోబీఘాట్

మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు...
◆ వినయ్‌నగర్, గణేష్ టెంపుల్, శ్రీకార్ హోటల్, భోజిరెడ్డి కాలేజ్, మాతృశ్రీ కాలేజ్, దోబీఘాట్ మెయిన్‌రోడ్, గరుదాస్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాలు

ఉదయం 9 నుంచి 9.30గంటల వరకు...
◆ మటన్ మార్కెట్, రాణీబాగ్, ఇదారా ఏ మిలియా మజీద్, బాదం గల్లీ, వాటర్ పంప్ హౌజ్, పద్మానగర్

మధ్యాహ్నం 3నుంచి 3.30గంటల వరకు..
◆ అక్బర్ టవర్, పూల్‌బాగ్, నల్గొండ క్రాస్ రోడ్, పెట్రోల్ బంక్ బ్యాక్ సైడ్, కాలడేరా ఫుట్ బాల్ గ్రౌండ్, ఏపీఏయూ కాలనీ, వెంకటేశ్వర కామర్స్ కాలేజ్, ఇండుస్‌ల్యాండ్ బ్యాంక్, వాణిజ్యవిహార్, నలంద కాలేజ్, బిగ్ సీ.

ఉదయం 10నుంచి 10.30గంటల వరకు..
◆ శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్‌మెంట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్,పీఅండ్‌టీ కాలనీ కల్లు కాంపౌండ్, ఎంబీటీ హట్స్, మెహిది కార్నర్, అఫ్జర్‌ఖానా, గ్రీన్‌ల్యాండ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 3.30నుంచి 4గంటల వరకు..
◆ డాన్ స్కూల్, బీబీ క్యాన్సర్ హాస్పిటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, మౌలీ కా మాస్క్, బాబు మియా గిర్నీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..
చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు సాయిరాంనగర్, శిఖరాఎన్‌క్లేవ్, నాగార్జున, ఆర్‌టీసీ, భానునగర్, కేశవనగర్, సింగరేణి, రాఘవేంద్ర కాలనీలలో...
◆ శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు గ్రీన్‌పార్కు, శ్రీనివాసనగర్, శ్రీరాంనగర్, తపోవన్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

13న గ్రాండ్ జాబ్ మేళా

మలక్‌పేట: ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఇబ్నాత్ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్న గ్రాండ్ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్ ఫెయిర్ కొనసాగుతుందని అన్నారు. ఫ్రెషర్స్, అనుభవం ఉన్నవారు ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకింగ్, సేల్స్, డిజిటల్, మార్కెటింగ్ తదితర వాటిలో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టెన్త్ నుంచి పీజీ చదివిన వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.81250 04111.

చిత్రలేఅవుట్ కాలనీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం చక్రపాణి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రారావు, కోశాధికారి మట్టపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అనంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసింహగౌడ్, జాయింట్ సెక్రటరీగా స్వామిరావు, పురుషోత్తం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్‌రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా గోవర్ధన్, డైరెక్టర్లుగా వెంకట్, రామకృష్ణ ప్రసాద్, మల్లేష్, సబిత, విజయలక్ష్మి, ఉష మోహన్‌రాజు, పాస్ట్ జిల్లా గవర్నర్ వెంకటాచారి సలహాదారులు అప్పారావు, నర్సింహారెడ్డి, జవహర్‌లాల్, రామచంద్రారెడ్డి, అంజల్‌రావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిరోజు నడకను అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గంగాధర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ముస్కు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేవుట్ కాలనీలో ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సభ్యులు


ఎల్బీనగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు


బీఎన్‌రెడ్డినగర్‌లో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మేమంతా మీ వెంటే.!

● భారత సైనికులకు మద్దతుగా భారీ ర్యాలీలు ● ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో ర్యాలీలో కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: పహల్గాంకు ప్రతీకారంగా పాక్ ఉగ్రమూకలపై నిప్పులు కురిపించిన భారత సైనికులకు, దేశ రక్షణ కొరకు ఏ చర్యలు తీసుకున్నా 'మేమంతా మీ వెంటే ఉన్నాం..'అని చెప్పి సైనికులు, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో ఆర్‌ఆర్‌ఎస్ ఆధర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. భద్రతా దళాల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై కాలనీలో ర్యాలీ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్‌జీ, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీమనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, చిత్రలేవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గణేష్, ఆర్‌ఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణయ్య, సాయి, భవండ్ల రఘు, సత్యనారాయణరెడ్డి, కుసుమ, సబిత, రేగట్టే సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..
ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీలో ఇంటర్ నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. భారత్ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ జయప్రదంగా కొనసాగుతున్న సందర్భంగా శుక్రవారం చిత్రలేవుట్ కాలనీ పార్కులో భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, గంగాధర్, కాలనీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి రామచంద్రరావు, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్వామిరావు, వెంకట్, హనుమంతరావు, మల్లేష్, అంజన్‌రావు, రాఘు, సాయి కృష్ణ, సరస్వతి, పద్మావతి, వనజ, శోభ, సభితారెడ్డి, రామేశ్వరి, నిర్మల, సతీ, శ్రీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భారత్ విజయం సాధించాలని ప్రత్యేక పూజలు
లింగోజిగూడ: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలని ఎల్బీనగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు దేశ సంరక్షణ కోసం ప్రత్యేక అభిషేకలు, గణపతి, సుదర్శన హోమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుంటి లక్ష్మణ్, ఈఓ ప్రేమ్‌కుమార్, అర్చకులు పండారి శివ శంకర శాస్త్రి, చంద్రశేఖర రావు, వామనరావు, ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ సమైక్యత ర్యాలీ...
వనస్థలిపురం: పాకిస్తాన్‌కు భారతదేశం అంటే ఏమిటో తెలిసేలా దెబ్బకు దెబ్బ తీస్తున్న భారత సైన్యానికి వందనాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీపురంకాలనీ నుంచి ఎస్‌కేడీనగర్ చౌరస్తా వరకు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ సమైక్యత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... యుద్ధం వస్తే భారత సైనికులకు మనమందరం మద్దతుగా నిలవాలలన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా (అర్బన్) అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సామ రంగారెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, నవీన్‌శర్మ పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు అశ్రు నివాళి

ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ


అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

నాగోలు: దేశ సరిహద్దు ప్రాంతంలో పాకిస్తాన్ జరిపిన కాల్పులకు భారత సైనికుడు మురళీనాయక్ అమరుడయ్యాడు. శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర లక్‌పతి నాయక్ వారు మాట్లాడుతూ... పాకిస్తాన్ యుద్ధానికి కాలు దువ్వుతూ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న భారత సైనికులపై కాల్పులకు దిగుతోందన్నారు. సరిహద్దులో జరిగిన హోరాహోరీ పోరులో వీరోచితంగా పోరాడి మురళీనాయక్ అమరుడయ్యారని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబ సభ్యులకు యావత్ భారతీయుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అశ్రు నివాళి అర్పించారు. భారత దేశంపై అక్కసుతో పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తోందని అన్నారు. పాకిస్తాన్‌తో పాటు ఉగ్రవాదులకు భారత సైన్యం సరైన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివప్రచండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మూడావత్ గోపినాయక్, గిరిజన సంస్కృతి చీఫ్ ఎడిటర్ రమావత్ ధర్మానాయక్, బంజారా బావోజీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జటావత్ లక్ష్మణ్ మహారాజ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎరుకల నాంచారమ్మ జాతరకు వెళ్లాలి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే రాష్ట్ర జాతరగా పేరున్న ఎరుకల నాంచారమ్మ జాతరను ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ పిలుపునిచ్చారు. ఎరుకల నాంచారమ్మ ఆలయ కమిటీ సభ్యులు మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి టీనగర్‌కాలనీలోని మధుయాష్కి నివాసంలో ఆయనతో పాటు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు బుడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ.. భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన అమ్మవారి జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తారని తెలిపారు. ఈనెల 12న ఎరుకల నాంచారమ్మ-సోడయ్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నేతలు రాంపల్లి నర్సింహ, బన్నాపురం రఘు, కందెల వెంకటేష్, మండపం గోపాలు, నారాయణ, విశ్వనాథ్, చిరుమర్తి శేఖర్, శ్రీనివాస్, సదానందం, రాధాకృష్ణ, విరేశం తదితరులు పాల్గొన్నారు.


ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధుయాష్కిగౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఐదుగురి జీవితాల్లో వెలుగులు

అవయవదానం చేసిన రిటైర్డ్ హెచ్‌ఎం వి.రామ్మోహన్


(ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపారు ఓ రిటైర్డ్ హెడ్‌మాస్టర్. జీవన్‌ధాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ... మల్కాజిగిరి హనుమన్నపేటకు చెందిన వి.రామ్మోహన్ (64) రిటైర్డ్ హెడ్‌మాస్టర్. ఈనెల 4న తన ఇంట్లో ఆకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎమర్జెన్సీలో ఉంచి చికిత్సను అందించారు. చికిత్సకు స్పందించకపోవడంతో ఈనెల 8న మధ్యాహ్నం 2.56గంటలకు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు రామ్మోహన్ భార్య విజయలక్ష్మి, కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అవయవదానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు.

మలక్‌పేటలో 6కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు.. ఇద్దరి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

మలక్‌పేట: మలక్‌పేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు గురువారం సాయంత్రం ఓ ఇంట్లో దాడులు చేసి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ ఏ. నరేందర్ తెలిపిన వివరాలు.. సంతోష్‌నగర్ ఈడ్ బజార్ ప్రాంతంలో నేపాల్‌కు చెందిన సూర్యసింగ్, రమేష్ బహదూర్ అనే ఇద్దరు వ్యక్తులు కిరాయికి ఉంటున్నారు. వీరు ధూల్‌పేటకు చెందిన అభిషేక్ సింగ్ వద్ద తరచు గంజాయిని తీసుకొచ్చి మలక్‌పేట ప్రాంతంలో ఎక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ నరేందర్ పర్యవేక్షణలో వారు నివాసం ఉంటున్న ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 6 కిలోల గంజాయి పట్టుబడింది. రూ. 3 లక్షలు విలువ చేసే గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా.. సూర్యసింగ్, రమేష్ బహదూర్ ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సైలు సుజాత, శివచరణ్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సురేందర్, ప్రసాద్, శంకర్, విక్రమ్‌లు పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ఆశాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దివ్యాంగ నాయకులు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ పరిధిలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో వికలాంగులను నియమించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని లిఫ్ట్ ఆపరేటర్లుగా వికలాంగులను నియమించాలన్నారు.

కర్మన్‌ఘాట్‌లో త్రిపుర గవర్నర్ దంపతుల పూజలు



చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజినేయ స్వామివారిని శుక్రవారం త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి దంపతులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య, సిబ్బంది వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన అనంతరం జిల్లా పరిషత్ రోడ్డులోని అగ్రికల్చర్‌కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

సురభి కళాకారుడు సుబ్బారావు మృతి

వనస్థలిపురం: శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) సమాజానికి చెందిన ప్రముఖ కళాకారుడు ఎస్.సుబ్బారావు (78) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు సురభి వేణుగోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బారావు మాయాబజారులో హిడంబిగా, శ్రీ శ్రీనివాస కళ్యాణంలో ఆకాశరాజుగా, పాతాళ భైరవిలో రాజుగా, బ్రహ్మ, కాలకౌశికుడు, వీరబాహుడు మొదలకు పాత్రలలో తనదైన నటనతో ప్రేక్షకులను రంజింపజేశారని వేణుగోపాల్‌రావు తెలిపారు. శనివారం లింగంపల్లిలోని సురభి కాలనీలో సుబ్బారావు అంత్యక్రియలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాకిస్తాన్‌కు మద్దతుగా ఇన్‌స్టాగ్రాంలో విద్యార్థిని పోస్ట్

● విషయం తెలుసుకుని కళాశాల ఎదుట బీజేపీ ఆందోళన
● విద్యార్థిపై దేశ ద్రోహం కేసు పెట్టాలని డిమాండ్
● పోలీసులు హామీ ఇవ్వడంతో వెనుదిరిగిన నాయకులు


విద్యార్థిని చేసిన ఓ పోస్ట్

చంపాపేట: పాకిస్తాన్‌కు మద్దతుగా... ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన విద్యార్థిపై దేశద్రోహం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశాడు. చంపాపేట డివిజన్ ఎస్‌జీఆర్ కాలనీలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పాతబస్తీకి చెందిన ఓ విద్యార్థిని పాకిస్తాన్‌కు మద్దతుగా.. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన బీజేపీ నేతలతో శుక్రవారం కళాశాలకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టడమే కాకుండా కళాశాల నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా.. పాకిస్తాన్‌కు మద్దతుగా మాట్లాడిన వారిని వదలిపెట్టొద్దని డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులను పోలీసులు సముదాయించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోరారు. ఈ నిరసనలో నాయకులు పాశం శ్రీశైలం, రమేష రాజేష్, గోపీ, కళ్యాణ్ పాల్గొన్నారు.


ఎస్‌జీఆర్ కాలనీలోని కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టుతున్న బీజేపీ నేతలు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


ఎన్టీఆర్‌నగర్‌లో సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: దేశ వ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు గోపీనాయక్, సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లేపాక వీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో కూరగాలయ మార్కెట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 11ఏళ్లుగా కార్మిక ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. జాతీయ సహజ వనరులు ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ఇతర నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారని అన్నారు. 20న జరిగే సమ్మెలో అందరూ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాములు, ఎండీ షాలావో దీన్, టి.మల్లేష్, శ్రీను, రవి, స్వామి, కిరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం


పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సైదాబాద్‌లోని శంకేశ్వరబజార్‌లో పర్యటించారు. కాలనీవాసులతో కలిసి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని డ్రైనేజీలు పూడికతో నిండి మురుగునీరు రహదారులపై పారుతూ తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వారు కార్పొరేటర్‌కు తెలిపారు. అందుకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ సిబ్బందిని రప్పించి కాలనీలోని డ్రైనేజీల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి


ఉపాధ్యాయుల ప్రశిక్షణ వర్గలో వీరేంద్రబాబు

సైదాబాద్: తరగతి గదిలో చిన్నారులను అత్యుత్తములుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. సరస్వతీనగర్ కాలనీలోని శిశుమందిర్‌లో తెలంగాణ ప్రాంత శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిశువాటిక ఆచార్య ప్రశిక్షణ వర్గ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశిక్షణ వర్గలో పాల్గొనే ఉపాధ్యాయులు బోధనకు సంబంధించిన చక్కని విషయాలపై మరింత అవగాహన పెంచుకుంటారని అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంచే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సంఘ్ చాలక్ బర్ల సుందర్‌రెడ్డి, తోట అమర్‌నాథ్‌రెడ్డి, గడ్డం దశరథ్‌రెడ్డి, రవీందర్, శివలీల, మానస, సంధ్య పాల్గొన్నారు.